## క్లుప్తంగా

### రేపు స్పోర్ట్స్‌స్కూల్ ప్రవేశాల ఎంపిక: ఎంఈఓ వెంకటయ్య

పెద్దేముల్: ఈ నెల 11న 4, 5 తరగతులలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు జరుగుతాయని పెద్దేముల్ మండల విద్యాధికారి వెంకటయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని హకీంపేట, అదిలాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు పొందాల్సిన విద్యార్థులకు పీఈటీల సమక్ష్యంలో ఎంపికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికలు పెద్దేముల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతాయని చెప్పారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయికి పంపడం జరుగుతుందన్నారు.

### 31 వరకు ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు

అనంతగిరి: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పొందేందుకు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వికారాబాద్ అనంత పద్మనాభ కళాశాల అంబేడ్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్ ,పాలిటెక్నిక్, ఐటీఐ రెండు సంవత్సరాలు కోర్సులో పాసైన వారు అర్హులు అన్నారు. విద్య తృతీయ సంవత్సరం విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈ నెల 31 చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9985635653 ను సంప్రదించాలన్నారు.

### బ్రహ్మగర్జనకు తరలిన బ్రాహ్మణులు



సభకు తరలుతున్న సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: హైదరాబాద్‌లోని ఎల్‌బిన గర్ సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించే బ్రహ్మగర్జనకు నియోజకవర్గంలోని బ్రాహ్మణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో శ్రీలలితా విష్ణు సహస్ర నామ పారాయణంతో పాటు పీఠాధిపతుల అనుగ్రహ సంభాషణ జరగనుందని తెలిపారు. బ్రాహ్మణుల హక్కులు, ఆత్మగౌరవం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి తరలివెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, సంఘం సభ్యులు కిట్టుస్వామి (విజయకృష్ణ) తదితరులున్నారు.

### మరోసారి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అంజనేయులు



కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ పున:వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడిగా అంజనేయులు ముదిరాజ్‌ను మరోసారి కొనసాగించారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి నివాసంలో కుల్కచర్ల మండల అధ్యక్షుడిగా అంజనేయులును నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రామ్మోహన్ రెడ్డి సూచించారు. అంజనేయులు మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీని పటిష్ఠంగా మార్చడంతో పాటుగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మండలం నుంచి అధిక మెజార్టీ వచ్చేలా కృషి చేస్తానన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో బీఆర్‌ఎస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి

మోమిన్‌పేట: క్రీడలతో మానసికోల్లాసం కల్గుతోందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెల్‌చాల్‌లో క్రికెట్ టీం సభ్యులకు డ్రస్‌కోడ్, క్రికెట్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఉద్యోగావకాశాలలో క్రీడల వల్ల రిజర్వేషన్ లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, గ్రామ యువకులు తదితరులు ఉన్నారు.

### ఘాటెక్కిన మిర్చి

కిలో రూ.100

అనంతగిరి: వికారాబాద్ రైతుబజార్‌లో ఆదివారం పచ్చి మిర్చి కిలో రూ.100 పలికింది. పావు కిలో తీసుకుంటే 30, కిలో రూ.100కు విక్రయించారు. పలువురు వినియోగదారులు, హోటల్స్ నిర్వాహకులు నిత్యం వినియోగించే మిర్చి కంటే తక్కువ మోతాదులో తీసుకెళ్లారు. కాగా, మిర్చి పంట పండించిన రైతులు మాత్రం ఈ ధరలు మమ్మల్ని ఆదుకుంటున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పలువురు వినియోగదారులను మిర్చి కొనరా అని రైతులు అడగ్గా మిర్చి రేటు చూస్తుంటేనే ఘాటెక్కుతుంది.. ఇంకా కొనాలా అంటూ నవ్వుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# శివసాగర్‌కు మోక్షం ఎన్నడో?

- నత్తనడకన ప్రాజెక్టు కాల్వ పనులు
- ఇప్పటికే పూర్తయిన సర్వే
- హద్దులను గుర్తించి సిద్ధం చేసిన ఇరిగేషన్ శాఖ
- ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు



వరదనీటితో కళకళలాడుతున్న శివసాగర్ ప్రాజెక్టు

యాలాల: మండలంలోని విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై నిర్మిస్తున్న శివసాగర్ ప్రాజెక్టు కాల్వల నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. కొత్త ఏడాదిలో కాల్వల నిర్మాణ పనులు ప్రారంభమతాయని ఆశపడ్డ ఆయకట్టు రైతులకు నేటికి నిరాశే ఎదురైంది. కాగా, కాల్వ నిర్మాణ పనులకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కాల్వల నిర్మాణ పనుల్లో భాగంగా గతంలోనే కాల్వల అలైన్‌మెంట్ ఏరియాను గుర్తించి హద్దులు నిర్ణయించారు. అయి నప్పటికీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. 6 ఏళ్లుగా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులకు, మండలవాసులకు శివసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు అందుతుందనే ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి.

**2005లో ప్రాజెక్టుకు అంకురార్పణ**

జలయజ్ఞంలో భాగంగా కాకరవేణి నదిపై విశ్వనాథ్‌పూర్ శివారులో శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 2005 ఆగస్టు 4న అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టు పది అడుగుల నీటిమట్టం , వెయ్యి ఎకరాల ఆయకట్టుతో ఇక్కడి రైతులకు ఎంతో ఆశపెంచింది. అయితే కాలక్రమేణ వివిధ కారణాలతో ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు, అరడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది.

**పెరిగిన అంచనా వ్యయం**

కాగా, శివసాగర్ ప్రాజెక్టును 2005లో రూ.5 కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు ప్రారంభించారు. కాలక్రమేణ నాసిరకమైన పనుల కారణంగా శివసాగర్ ఎడమ కాల్వ తూము ఏడేళ్ల క్రితం భారీ వరదలకు కొట్టుకుపోయింది. భారీ వరద ఉధృతి కారణంగా అలుగు ప్రాంతం దెబ్బతిని, రెవిట్‌మెంట్, బెడ్లు దెబ్బతిని భూమి కోతకు గురైంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రాజెక్టు అంచన వ్యయం రూ.12 కోట్లకు చేరింది. ప్రస్తుతం అలుగు పని పూర్తి కాగా, కాల్వలు, తూముల నిర్మాణాలు మిగిలిపోయాయి.

**నిర్మాణ పనులకు అలైన్‌మెంట్ కేటాయింపు**

శివసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు వెయ్యి ఎకరాలకు పైగా ఉంది. ఆయకట్టు కింద విశ్వనాథ్‌పూర్, యాలాల, గోవిందరావుపేట, సంగెంకుర్దు, రాఘవపూర్, కమాల్‌పూర్, కోకట్ తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. ఎడమ కాల్వ 4 కిలోమీటర్ల మేర నిర్మించనుండగా, కుడి కాల్వ 3 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన అలైన్‌మెంట్ సైతం అధికారులు సిద్ధం చేశారు. కాల్వల నిర్మాణంతో పాటు గతంలో కొట్టుకుపోయిన తూము పునః నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

**వేసవిలోగా పూర్తి చేస్తాం**



చిన్న చిన్న సమస్యల కారణంగా కొద్దిగా ఆలస్యమైంది. భూసేకరణ, అలైన్‌మెంట్ కేటాయింపులో కొన్ని సమస్యలు ఏర్పడ్డాయి. ప్రస్తుతానికి అన్ని సమస్యలు పరిష్కరమయ్యాయి. వచ్చే వేసవిలోగా కాల్వ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో అయిపోతాయి.

– కృష్ణయ్య, డీఈఈ ఇరిగేషన్ తాండూరు

# కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి**



విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్ రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని ఏఎస్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్ ఇటీవల కంప్యూటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతీ అంశం కంప్యూటర్‌తో ముడిపడి ఉందని, ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో తోడ్పాటునందిస్తుందని అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రొప్రైటర్ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ.. వేసవికాలంలో డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ మిషన్ కొడంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణలో 150మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 140మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, ప్రవళిక పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి**



కోట్ల మైసమ్మను దర్శించుకుంటున్న మహేందర్‌రెడ్డి తదితరులు

తాండూరు: దేవాలయాల అభివృద్ధి తన వంతు విరాళం అందిస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు వార్డులకు వెళ్లి నాయకులను, కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయం వద్ద బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలకు పట్నం మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటి కొండస్వప్నలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనకు రూ.51 వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు. అంతే కాకుండా కోట్ల మైసమ్మ దేవాలయంలో జరుగుతున్న ఆశాఢబోనాల జాతర ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కోట్లమైసమ్మ దేవాలయ అభివృద్ధికి రూ.5లక్షల నిధులను వారం రోజుల్లో కేటాయిస్తానని దేవాలయ కమిటీ సభ్యులకు తెలిపారు. ఎమ్మెల్సీ వెంట బాలాజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్.బి.సంపత్‌కుమార్, మున్సిపల్ బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ బొబ్బిలి శోభారాణి, కౌన్సిలర్‌లు బోయరవిరాజ్, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ పరిమళ, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు పట్లోళ్ల నర్సింహులు, నాయకులు తదితరులున్నారు.

# ఆర్టీసీ సేవలపై అవగాహన



కుల్కచర్ల: అవగాహన కల్పిస్తున్న అధికారి చంద్రయ్య, మహిళలు

కుల్కచర్ల: ఆర్టీసీ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఆర్టీసీ డిపో ముజాహిద్‌పూర్ విలేజ్ కో–ఆర్డినేటర్ చంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో టీ–9 టికెట్లపై ప్రయాణికులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల ప్రకారం ప్రతీ గ్రామానికి టీ–9 టికెట్లను రూపొందించడం జరిగిందన్నారు. పరిగి డిపో మేనేజర్ పవిత్ర సూచనల ప్రకారం నియోజకవర్గ వ్యాప్తంగా టీ–9టికెట్లపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. టీ–9 టికెట్ల ద్వారా 60కిలోమీటర్ల దూరం పరిధిలో వచ్చిపోయేందుకు గాను కేవలం వంద రూపాయలు చెల్లించి ప్రయాణించవచ్చని ఆయన పేర్కొన్నారు. దీంతో 40రూపాయ ల రాయితీని పొందే అవకాశం ఉందన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సైతం రాయితీతో ప్రయాణించవ చ్చని ఆయన సూచించారు. ఒక్కరోజులో ఎక్కువ సార్లు ప్రయాణించే వారికి ఉపయోగపడుతుందన్నారు.

**ఆర్టీసీ సేవలతో లబ్ధి**

మర్పల్లి: ఆర్టీసీ సంస్థ సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ ఆర్టీసీ డిపో విలేజీ బస్సు అధికారి ఎల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్టీసీ సంస్థ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రజలకు మంచి రవాణా సేవలు అందించే విధంగా రూ. 100కే 60 కిలోమీటర్లు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యార్థులకు ఇచ్చే ఉచిత బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుభకార్యాల కోసం తమ సంస్థ అద్దెకు బస్సులు ఇవ్వనుందన్నారు. ఇవే కాకుండా ప్రయాణీకుల సౌకర్యం కోసం పలు రాయితీలు అమలు చేస్తుందన్నారు.

### ఉపాధి కూలీలకు శిక్షణ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ వెంకటేశ్, స్థానిక సిబ్బంది

కుల్కచర్ల: ఉపాధిహామీ పథకంలో వందరోజుల పనులు పూర్తి చేసుకున్న కూలీలందరికీ ఉన్నతి అనే కార్యక్రమం ద్వారా శిక్షణ అందిస్తున్నామని ఏపీఓ వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కామునిపల్లిలో కూలీల గుర్తింపు ప్రకారం శిక్షణకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో మెరుగైన ఫలితాలు సాధించే క్రమంలో వందరోజులు పూర్తి చేసుకున్న కూలీలకు ఉన్నతి అనే కార్యక్రమం ద్వారా శిక్షణను ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలయ్య, పీల్డ్ అసిస్టెంట్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

### నూతన నియామకం



నియమాక పత్రం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

దోమ: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడుగా శాంతుకుమార్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం పరిగిలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నియమాక పత్రం అందజేశారు. ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన శాంతుకుమార్ ఎన్నో ఎళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలను చేస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించారు. మండలంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి అనునిత్యం కృషి చేస్తూ, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి దోహదపడేలా కృషి చేయాలని చెప్పారు.

# అర్హత కల్గిన వారికి పదోన్నతి ఇవ్వాలి

**పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రాములు**



సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

మోమిన్‌పేట: అర్హత కల్గిన పంచాయతీ కార్మికులకు కారోబారులుగా పదోన్నతి ఇవ్వాలని మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కార్మికుల సమ్మె నాల్గవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కల్గిన కారోబారులను బిల్ కలెక్టరులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పంచాయతీ కార్మికుల వెట్టి చాకిరి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం వేతనం రూ.19500 ఇవ్వాలని ఆయన కోరారు. ప్రతి కార్మికునికి బూట్లు, బ్లౌజులు, బట్టలు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పాండు, రాజు, రాచయ్య, గోపాల్, మల్లయ్య, నిర్మల, చంద్రయ్య పాల్గొన్నారు.

### భక్తిభావం అలవర్చుకోవాలి



బంగారు కళ్లు బహుకరిస్తున్న శరత్‌కుమార్ రెడ్డి

దోమ: గ్రామీణ ప్రాంత ప్రజలు భక్తిభావాన్ని అలర్చుకోవాలని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాలేపల్లిలో ఊరడమ్మ దేవి ఉత్సవాల్లో భాగంగా కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మతో కలసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సత్యం పంతులుకు అమ్మవారికి బంగారు కళ్లు బహుకరించి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడి పంటలు బాగా పండేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అజయ్ కుమార్, మణికంఠ, ప్రతాప్, నర్సింహులు, రవి కాంత్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాండూరు: పట్టణంలోని విజయ విద్యాలయ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2002–2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిశారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులైన గోపిచంద్, సుబ్బరావు ,నారాయణ, సిద్దన్న, వీరయ్యలతో పాటు అటెండర్ భీమయ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడి చేశారు. స్నేహితులతో ఒకరికొకరు సంతోషాలు, బాధలను పంచుకొన్నారు.

# పలహారబండి నిర్వహణకు విరాళం

పరిగి: పట్టణ కేంద్రంలో 11వ తేదీన నిర్వహించే పలహారం బండి నిర్వహణకు డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆదివారం లక్ష రూపాయల విరాళం అందజేశారు. యూత్ మినిస్ట్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫలహారబండి కార్యక్రమం నిర్వహించేందుకు తన వంతు విరాళం అందించానని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బురదమయంగా మధుకాలనీ రోడ్డు



వర్షానికి చిత్తడిగా మారిన రోడ్డు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని మధు కాలనీలో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. శనివారం కురిసిన వర్షానికి రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉండడంతో కాలనీవాసులు అనేకమార్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో కాలనీవాసులు ప్రతి ఇంటి నుంచి రూ. 8000 చందా వేసుకొని రోడ్డుపై మొరం పోయించారు. ఈ ఏడాది వర్షాలు ప్రారంభం కావడంతో సమస్య మరింత ఎక్కువైంది. పోసిన మట్టి రోడ్డుపై కనీసం మున్సిపల్ ద్వారా డస్టు పోస్తే వాహనాలు వెళ్లడానికి వీలవుతుందని కాలనీ వాసులు కోరుతున్నారు.

# రోడ్లపై మురుగు పరుగు

- రోగాల బారిన ప్రజలు
- జాడలేని అధికారులు



పెద్దేముల్: ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

పెద్దేముల్: రోడ్లపై మురుగునీరు ప్రవహించి ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. అసలుకే రోగాల కాలం.. మండల అధికారులకు పట్టింపులేదు. నెలకు ఒకసారి కూడా గ్రామాలకు వెళ్లిన దాఖలాలు లేవు. సమస్యలపై ఫిర్యాదులు చేసిన నామమాత్రంగా చర్యలు చేపడుతారు. గత నెల రోజుల నుంచి మండల కేంద్రంలోని ఎంఆర్‌కే కాలనీలో మురుగునీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్నా.. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆ దారిన నడవాలంటే కష్టంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ కార్మికులకు ఏడాదికి ఒకసారి కూడా ఇక్కడ శుభ్రం చేయరని అంటున్నారు. పన్నులపై చూపే శ్రద్ధ పనులపై ఎందుకు చూపడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో సమస్యలపై పర్యవేక్షణ చేయాల్సిన మండల ఎంపీఓ షేక్ సుష్మా ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. కనీసం మట్టి కూడా పోయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ లక్ష్మప్పను వివరణ కోరగా తప్పకుండా సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# బోనం.. వైభవం

ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ఆదివారం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాలకు బోనాలతో మహిళలు ఊరేగింపు బయలుదేరి వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.. శివసత్తుల పూనకాలు, డప్పుల వాయిద్యాల మధ్య పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవార్లను దర్శించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



పూడూర్ : బోనాలతో మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు



దౌల్తాబాద్: బోనాలతో మహిళలు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో బోనాలతో భక్తులు



పరిగి: గంగపుత్రుల చేపల వల పందిరితో బోనాల ఊరేగింపు



తాండూరు రూరల్: బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు